# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 11, ఏప్రిల్ 2026




## రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్పి నీతికాపంత్, అదనప కలెక్టర్ ఏం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్ల ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారులు ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వున్న గ్రామాలలో లైటింగ్ ఏర్పాట్లు, సర్వీస్ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేసేలా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ శాఖ అధికారులు రహదారులకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, వేలాడే తీగలను సరి చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు రేడియం అంటించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ దత్తారావు, రవాణా శాఖ అధికారి రామచందర్, డిపిఓ భిక్షపతి, ఎస్ఇ విద్యుతు శాఖ ఉత్తం జాడే, పిఆర్ ఇఇ ధర్మేందర్, విద్యా, వైద్య నేషనల్ హైవే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### అపరిష్కృత సమస్యలు పరిష్కరించకుంటే

## సమ్మెకు పిలుపునిస్తాం



- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య
- శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ఏఐటీయూసీ గేట్ మీటింగ్

**నస్పూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ నెలలో సమ్మెకు పిలుపునిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం సీహెచ్‌పీ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిలిపివేసిన మెడికల్ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అపరిష్కృుృత సమస్యలపై అన్ని సంఘాలను కలుపుకొని పోరాడుతామని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి 25 లక్షల రూపాయలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా, అఫ్రోజ్ ఖాన్, రవి, సాయి రాజు, గజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ వైద్య విధానం

## ప్రపంచానికి ఆదర్శం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ వైద్య విధానం ఆదర్శంగా నిలిచిందని, ఎన్నో రకాల వైద్య పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసే విధానాలను అవలంబించడం జరుగుతుందని తెలిపారు. భారతీయ వైద్య వ్యవస్థలో హోమియో, ఆయుర్వేదం, యునాని, యోగ వంటి అనేక పద్ధతులలో వ్యాధులను నయం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కీళ్ల నొప్పులు, మధుమేహం, రక్త పటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను హోమియోపతి, న్యాచురోపతి, యోగ వంటి విధానాల ద్వారా నియంత్రించవచ్చుని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అతి మిగతా 2లో..



### ఇందిరమ్మ ఇండ్లు-పారిశుధ్యం

## పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్

- ప్రజాపాలన ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం సహించం

**మందమర్రి, ఏప్రిల్ 10,ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని మిగతా 2లో..



## సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి గిరిజనుడికి అందించాలి

**ఉట్నూర్,ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల ప్రతి గిరిజనుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ లోని ఐ టి డి ఎ కార్యాలయ ప్రాజెక్టు అధికారి చాంబర్ లో అన్ని విభాగాల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమర్ధవంతంగా నిర్వహించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఆరోగ్యం, గిరిజన సహకార సంస్థ, ఇంజినీరింగ్, విద్య, గురుకులాలు, మహిళా శిశు సంక్షేమం, ఉద్యానవన, వ్యవసాయ, గ్రామీణ నీటి సరఫరా, మిగతా 2లో..



## భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

సాధారణ ఖర్చులతో ప్రకృతికి దగ్గరగా యోగ, ఫిజియోథెరపీ ద్వారా అందించే చికిత్సకు మంచి ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, గ్రామీణ స్థాయి నుండి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, మన జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్లు-పారిశుధ్యం

## పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచి పారిశుధ్య నిర్వహణను కట్టుదిట్టంగా చేపట్టాలని అన్నారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వేసవి కాలం నేపథ్యంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షణ పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి గిరిజనుడికి అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

భూ వివాదాలు, అటవీ హక్కుల చట్టం, తదితర విభాగాల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విభాగం పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, లక్ష్యాల సాధన, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలని, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. సంక్షేమ పథకాల లక్ష్యాలు లబ్ధిదారులకు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, శాఖల మధ్య సమన్వయం పెంచాలని తెలిపారు. భూహక్కులు, త్రాగునీరు, ఆరోగ్య సేవలు, విద్యా రంగాల్లో ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు. అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారం మండల నూతన తహశీల్దార్‌గా గేడేకర్ బక్కయ్య బాధ్యతల స్వీకరణ

జన్నారం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త



జన్నారం మండల నూతన తహశీల్దార్‌గా గేడేకర్ బక్కయ్య శనివారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో సాదాసీదా కార్యక్రమం నిర్వహించారు. ఇంతకాలం ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన రామ్ మోహన్, గేడేకర్ బక్కయ్యకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు (జీపీవోలు), రెవెన్యూ సిబ్బంది తదితరులు కూడా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గేడేకర్ బక్కయ్య మాట్లాడుతూ, మండల ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, పాస్‌బుక్‌లు, ధరణి సేవలు, ఆదాయ, కుల, నివాస ధృవ పత్రాల జారీ వంటి అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్ధవంతంగా చేరేలా చర్యలు తీసుకుంటానని, రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని చెప్పారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు ఇళ్ల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలి

### మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ - శ్యామ్ నగర్, సోనియా నగర్ ఏరియాల్లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

నస్పూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త



వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు ఇళ్ల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ పిలుపునిచ్చారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యామ్ నగర్, సోనియా నగర్ ఏరియాల్లో శుక్రవారం పోలీస్ సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు సెలవుల్లో ఊర్లకు వెళ్లేటప్పుడు ఇళ్లకు తాళాలు వేసి విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని కోరారు. దొంగతనాల నివారణకు ప్రతి డివిజన్‌లో సీసీటీవీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న క్రమంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా జాగ్రత్తలు పాటించాలని ఏసీపీ కోరారు. హెల్మెట్ ధరించిన వాహనదారులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండి ప్రాణాపాయం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా పోలీసులు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 60 వాహనాలు, 7 ఆటోలకు జరిమానాలు విధించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రవీందర్, సీసీసీ నస్పూర్ ఎస్సై ఎం. ప్రశాంత్, హాజీపూర్, శ్రీరాంపూర్ ఉమెన్ పీఎస్, సీసీసీ నస్పూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కార్యక్రమం

### - ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు - సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని అధికారుల సూచనలు

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ మండల వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ మనోహర్ ఆధ్వర్యంలో రైతులకు పంట మార్పిడి పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంట మార్పిడి ప్రాముఖ్యత, భూసారం పెంపు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ మనోహర్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టి మెరుగైన దిగుబడులు, అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. పంట మార్పిడి వల్ల భూసారం పెరిగి, పంటల ఉత్పాదకత మెరుగుపడుతుందని తెలిపారు. రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాలపై మరింతగా దృష్టి సారించాలని కోరారు. వరి పంట సాగు ముందు జనుము, జిలుగు వంటి పంటలను వేసి కలియ దున్నడం ద్వారా భూమి సారాన్ని పెంచుకోవచ్చని వివరించారు. ఏవో రామకృష్ణ మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పర్యావరణానికి హానికరం అవుతుందని పేర్కొన్నారు. అందువల్ల యూరియా వాడకాన్ని తగ్గించి, నానో ఎరువులు మరియు సేంద్రియ పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. జీవామృతం, వేప నూనె వంటి సేంద్రియ ద్రావణాల వినియోగం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ), ఆత్మ శ్రీనివాస్ గారు మరియు రైతులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

### - టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ వైద్య శాంతికుమారి




కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్‌లోని స్థానిక ఆదిత్య నర్సింగ్ హోమ్‌లో ఈనెల 12న టిఎస్‌యూటిఎఫ్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టిఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ వైద్య శాంతికుమారి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య శాంతికుమారి మాట్లాడుతూ మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ గార్ల జయంతుల సందర్భంగా ఈ నెల 12వ తేదీన ఉదయం 9 గంటల నుండి ఆదిత్య నర్సింగ్ హోమ్ కాగజ్‌నగర్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానం సమానమని, రక్తదానం వల్ల ఎలాంటి హానీ ఉండదని, ఆరోగ్యవంతులైన ప్రతి వ్యక్తి నిర్భయంగా రక్తదానం చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. సునీత గారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకొని, అవసరమైనప్పుడు ప్రాణాలను రక్షించడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రావుజీ టిఎస్‌యూటిఎఫ్ నాయకులు రాజకమలాకర్ రెడ్డి, మహిపాల్, ఫణతి మహేష్, సామాజిక కార్యకర్త ఈర్ల సునీల్ పాల్గొన్నారు.

# షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :




కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆదర్శ్ నగర్ అంగన్వాడి కేంద్రంలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి, భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ విద్యార్థినులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి, అలాగే ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, డయల్ 112 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యలు ఎదురైనపుడు కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565, భరోసా నంబర్ 8712670561 కు వెంటనే సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.డి. వసీం గారు, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, సునీత, భరోసా సభ్యులు శైలజ (అడ్వకేట్), డి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ సీనియర్ నాయకుడు గొర్రె జోసఫ్ రాజు మృతి

## - ప్రజాసేవకు అంకితమైన జీవితం ముగిసింది

**బెల్లంపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండల సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి, సీనియర్ ఆర్ఎంపీ వైద్యుడు గొర్రె జోసఫ్ రాజు (64) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం మండల వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. తాళ్లగురిజాల గ్రామానికి చెందిన ఆయన, సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రజాసేవను తన జీవిత లక్ష్యంగా ఎంచుకొని ఎన్నో రంగాల్లో సేవలందించారు. జోసఫ్ రాజు యువకుడిగా ఉన్నప్పటి నుంచే ఎడమపక్ష భావజాలం పట్ల ఆకర్షితుడై సిపిఐ పార్టీలో చేరి, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. రైతులు, కూలీలు, బలహీన వర్గాల సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించారు. మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహించి యువతను కూడా చైతన్యపరిచారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన కాలంలో ఆయన నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో పారదర్శకత పాటిస్తూ ప్రజల అభిమానం పొందారు. మూడు సంవత్సరాల క్రితం పదవీ విరమణ పొందినప్పటికీ, ప్రజా సమస్యలపై ఆయన స్పందన తగ్గలేదు. ఆర్ఎంపీ వైద్యునిగా నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన జోసఫ్ రాజు, పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. తాళ్లగురిజాల, రంగపేట, మాలగురిజాల, బట్వాన్‌పల్లి, లంబడి తండా వంటి పలు గ్రామాల్లో రాత్రింబవళ్లు తిరుగుతూ అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించి అనేక కుటుంబాలకు ఆదరణగా నిలిచారు. డబ్బు కంటే సేవే ముఖ్యమని నమ్మి, అనేకసార్లు ఉచితంగా మందులు అందించారని గ్రామస్థులు భావోద్వేగంతో గుర్తుచేసుకుంటున్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సేవా దృక్పథం మారలేదు. ఆర్ఎంపీ వైద్య వృత్తిని కొనసాగించడంతో పాటు, పాస్టర్‌గా కూడా సేవలందిస్తూ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేశారు. సమాజంలో ఐక్యత, మానవతా విలువలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి ఆదర్శంగా నిలిచిన జోసఫ్ రాజు మృతి వారికి తీరని లోటుగా మిగిలింది. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి





కన్నీరుమున్నీరయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ గ్రామస్థులు భావోద్వేగానికి లోనయ్యారు.

### సీపీఐ పార్టీకి తీరని లోటు...

జోసఫ్ రాజు అకాల మరణం సీపీఐ పార్టీకి, ముఖ్యంగా మండల స్థాయిలో పెద్ద దెబ్బ అని మండల సీపీఐ కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ తెలిపారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అచంచల నిబద్ధతతో పనిచేసిన ఆయనలాంటి నాయకుడిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక కాయంపై ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జోసఫ్ రాజు చూపిన మార్గంలో ముందుకు సాగుతామని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాలగురిజాల సీపీఐ శాఖ కార్యదర్శి గోమాస గంగారాం, నాయకులు మేరుగు పోశం, జూపాక సురేందర్, మాజీ సర్పంచ్ దూగుట తిరుపతి, కలాలి భూమేశ్వర్, అనుదీప్ భోగే కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు లక్ష్మణ్

## మూడు ఎకరాల మొక్కజొన్న దగ్ధం..

**భైంసా, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని కుంసారా గ్రామంలో గుర్తుతెలియని దుండగులు రైతు పంటకు నిప్పు పెట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్‌కు చెందిన మూడు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మధ్యాహ్నం సమయంలో దుండగులు పంటకు నిప్పు పెట్టినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా, చేతికి వచ్చిన పంట పూర్తిగా కాలిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయి కోలుకోలేని స్థితిలో ఉన్న రైతు లక్ష్మణ్‌ను ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వదూర్ గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభం

**నేరడిగొండ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



మండలంలోని వదూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్సై ఇమ్రాన్ ఖాన్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలను రిబ్బన్ కట్ చేసి ఆయన అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోకి ప్రవేశించే గుర్తుతెలియని వ్యక్తులను, అనుమానితులను గుర్తించేందుకు ఇవి సహాయపడతాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో భద్రత దృష్ట్యా కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు చంద్రశేఖర్, రాములు, పంచాయతీ కార్యదర్శి సద్దాం, వార్డు సభ్యులు సురేష్, లక్ష్మణ్, దేవిసింగ్, ప్రశాంత్, రజలింగ్, నడ్పెన్న, రమణ, రాజేశ్వర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి తండాలో కోతుల బెడదపై ఎంపీడీవోకు వినతి

**బెల్లంపల్లి, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మండలంలోని లంబడి తండ గ్రామపంచాయతీలోని పలు సమస్యలను బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్‌కు లేఖ ద్వారా వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లంబాడి తండా గ్రామ సర్పంచ్ సాగర్ల లక్ష్ముుుుుణ్ మాట్లాడుతూ లంబాడి తండ గ్రామంలో 99 రోజుల ప్రణాళికపై చర్చించిన అనంతరం పలు సమస్యలతో పాటు కోతుల బెరద గురించి కోతులు గుంపులుగా రోడ్లపై, ఇళ్ల యొక్క టెర్రస్‌లు, బాల్కనీలు మరియు చెట్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నాయని ప్రజలందరు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కోతులను సురక్షితంగా పట్టుకొని, అటవీ అధికారుల ద్వారా తగిన పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేందర్ స్పందిస్తూ ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీళ్ళ రజీత ప్రశాంత్, రంగ శ్రీలత వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**భైంసా, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరచడమే పోషణ అభియాన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి అందించిన ఈ ఫోన్ల ద్వారా పోషణ, ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి చేరవేయడం సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో సేవలందించేందుకు ఈ మొబైల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేగాం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి, ఐసీడీఎస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు

## వదూర్ గ్రామ పంచాయతీలో చలివేంద్రం ప్రారంభం

**నేరడిగొండ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**




పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు నేరడిగొండ మండలంలోని వదూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ అడేపు శ్రీకాంత్, పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి సద్దాం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేసవి కాలంలో బాటసారులు, గ్రామస్తుల సౌకర్యార్థం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వార్డు సభ్యులు లక్ష్మణ్, సురేష్, గ్రామస్తులు వీరన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంప్ మూడు రోజుల పాటు పొడిగింపు

### - మంచిర్యాల జిల్లా పోస్టల్ అడిషనల్ సూపరింటెండెంట్ రామారావు

**జన్నారం, ప్రభాతవార్త**



జన్నారం మండలం చింతగూడెం గ్రామంలోని ఆధార్ క్యాంపును మూడు రోజుల పాటు పొడిగిస్తున్నామని మంచిర్యాల జిల్లా పోస్టల్ అడిషనల్ సూపరింటెండెంట్ రామారావు తెలిపారు. శుక్రవారం నాడు ఆయన చింతగూడెం గ్రామంలోని ఆధార్ క్యాంప్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆధార్ క్యాంప్‌కు ప్రజల నుంచి స్పందన ఎక్కువగా ఉండడంతో ప్రజల సౌకర్యార్థం మూడు రోజులు పొడిగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి సుతారి వినయ్ కుమార్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శివ నామస్మరణతో మారుమ్రోగిన భోస్ర గ్రామం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**



మండలంలోని భోస్ర గ్రామంలో శివనామ సప్తాహ ముగింపు వేడుకలు, మహాప్రసాద కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ శ్యాంసుందర్, ఆర్ఐ నూర్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని మహారాజ్ పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మహారాజ్ భక్తులకు ఆధ్యాత్మిక సందేశమిస్తూ.. పెదవులపై నామస్మరణ, హృదయంలో శివధ్యానం ఆత్మకు శాంతినిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం ఓం నమః శివాయ మంత్రాన్ని జపించాలని, అదే మహాదేవునికి అందించే నిజమైన సేవ అని పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగిన ఈ సప్తాహంలో శివకథ, భజన కీర్తనల ద్వారా భక్తిని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సొంటకే గజానంద్, సంజీవ్, భోస్ర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**వేమనపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శనివారం వేమనపల్లి మండలంలో పర్యటిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా సూరారం, నాగారం నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా పార్టీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

### – పోషణ్ పఖ్వాడా నేపథ్యంలో గర్భిణీలు, బాలింతలకు సూచనలు

**మందమర్రి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

మందమర్రి దొరలబంగ్లా అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం రోజున 8వ పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగాపౌష్టికాహారం, రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పోషకాహార లోపంతో కలిగే అనర్థాలపై వివరణ ఇచ్చారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించడానికి ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్‌లతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. మందమర్రి సెక్టార్‌లోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, 06 సంవత్సరాల పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమాలు 2026 ఏప్రిల్ 9 నుండి 23 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు డి. సంధ్య, జి. పద్మావతి, అంగన్వాడి ఆయా జి. సరోజ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

## గన్నారం గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

మండలంలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, గన్నారం పాఠశాలను మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించి, ప్రిన్సిపల్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల స్టడీ అవర్‌ను పరిశీలించి, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ రమ్యకృష్ణ, ఉపాధ్యాయులు మరియు సీఆర్‌పీ తుకారాం పాల్గొన్నారు.



రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### - అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

**బెల్లంపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య సూచించారు. శుక్రవారం రోజున భీమిని మండలం రాంపూర్ గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు గృహసౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో మరింత మంది కూలీలను చేర్చాలని, ప్రతి కుటుంబం 100 రోజుల ఉపాధిని పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కూలీలతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్ రాయితీలు, రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామంలో అవసరమైన చోట రెండు కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మల్లిడి గ్రామపంచాయతీని సందర్శించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల ఎత్తు, బరువులను తనిఖీ చేసి, వారికి పౌష్టికాహారం అందించే విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే



గ్రామంలోని గర్భిణీలు, బాలింతలకు పాలు, పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి భీమిని గ్రామపంచాయతీని సందర్శించి గ్రామ అభివృద్ధి పనులను పరిశీలించారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రాంపూర్ సహా ఇతర గ్రామాలకు చెందిన భూసంబంధిత ఫిర్యాదులు, రికార్డులను పరిశీలించి, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ రాజేంద్రప్రసాద్, మల్లిడి గ్రామ సర్పంచ్ కర్ణ మమత, బిట్టురుపల్లి సర్పంచ్ పి.దశరథ్, భీమిని సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవ్, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



జేత్వాన్ బుద్ధ విహార్‌లో సమావేశమైన బౌద్ధ సంఘం నాయకులు

## మహనీయుల జయంతి రోజు మాంసాహారం, మద్యపానం నిషేధించాలి

**వాంకిడి ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

జ్యోతి బాపులే, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, తథాగత్ భగవన్ బుద్ధుడి, జయంతి రోజు మాంసాహారం, మద్య పానం నిషేధించాలని అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని భారతీయ బౌద్ధమసభ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సమతా సైనిక్ దళ్ సంస్థ ప్రతినిధులు అధికారులను, రాష్ట్ర ప్రభుత్వం ను కోరారు.శుక్రవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించి, బానిసత్వం కుల నిర్మూలన పై జీవితాంతం పోరాటం చేసి భారత దేశ ప్రజల విముక్తి కోసం బాటలు వేసి, భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సంఘసంస్కర్త జ్యోతిబాపూలే, ప్రపంచ శాంతి కోసం తన జీవితాన్ని అర్పించిన శాంతి దూత బుద్ధ భగవాన్ లాంటి మహనీయుల జయంతిల (పుట్టిన రోజుల ) సందర్భంగా జంతు బలి మద్యపానం నిషేధం అమలు చేసి తద్వారా ప్రజలకు అధికారులు,ప్రభుత్వం ఆదేశాన్ని అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్,సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్,బి ఎస్ ఐ జిల్లా ఆర్గనైజర్ విజయ్ ఉప్రే,సమతా సైనిక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రోషన్,భారతీయ బౌద్ధ మహా అధ్యక్షులు జైరాం,అంబెడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం దుర్గాజి,ఉపాధ్యక్షులు శ్యామ్ రావు దొండుజి దుర్గం,సమాజ్ అధ్యక్షులు శ్యామ్రావు లహుజీ,దుర్గం,రాజేశ్వర్ ఉప్రే, కార్యదర్శి ప్రతాప్,నాయకులు నాగ్ సేన్,ప్రశాంత్,రమేష్, కొయ్యల మహేష్,తిరుపతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే శారీరక మానసిక ఆరోగ్యంను జయించవచ్చు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

నిరంతర యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు శుక్రవారం యోగ ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ నినాదంతో జిల్లా సముదాయ ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమన్నారు యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వం పెరుగుతాయని అన్ని అన్నారు ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉదయం పాఠాలు ప్రారంభానికి ముందు యోగా నిర్వహణను చేపట్టాలని సంబంధిత అధికారులతో అన్నారు .ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు అశోక్ ఆర్య, రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, డీఆర్‌డీఓ దత్తారావు, వైద్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యోగాలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హరిత

# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

రహదారి భద్రతపై అరైవ్అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు రహదారి భద్రత, అరైవ్అలైవ్ కార్యక్రమము విజయవంతం చేయుటకు పలు శాఖల అధికారులు, ప్రైవేట్ పాఠశాలల అసోషియేషన్, లారీ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎస్పి నితికాపంత్, అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్ , కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న ప్రతి గ్రామ పంచాయతిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి రహదారి బద్రత కమిటి ఏర్పాటు చేయలన్నారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి రోజున పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి వాహన డ్రైవర్లు, ప్రజలు పాల్గొనేల రహదారి భద్రత



పై ప్రతిజ్ఞ నిర్వహించాలన్నారు. ఈ నెల 15న జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు రహదారి భద్రత సూత్రాలపై తప్పని సరిగా అవగాహనా కల్పించాలన్నారు. 16న పెట్రోల్ బ్యాంకుల వద్ద నో హెల్మెట్, నో పెట్రోల్ సూచిక బోర్డులు పెట్టాలన్నారు. 17న జిల్లాలోని ప్రతి పోలిస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు వాహన దారులకు, సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో పని చేసే ఉద్యోగులు, అధికారులు హెల్మెట్ ధరిస్తేనే కార్యాలయాలలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 18న మున్సిపాలిటి, మండల కేంద్రాలలో హెల్మెట్, సీటు బెల్టు ధరించిన వారికి విద్యార్థులచే పుష్పగుచ్చం అందించాలని, ధరించనివారికి ధరించేల వినతి పత్రం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమాని ప్రజా ప్రతినిదుల సహకారంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రైవేటు పాఠశాలల అసోషియేషన్, లారి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహిస్తున్న అధికారులు

## రైల్వే లైన్ అభివృద్ధిలో భాగంగా రోడ్డు అండర్ బ్రిడ్జ్ పనులకు శ్రీకారం

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

దక్షి ణ మధ్య రైల్వే సంస్థ వారు రైల్వే లైన్ విస్తరణ మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్‌లు (ఆర్ఓబి), రోడ్డు అండర్ బ్రిడ్జ్‌లు (ఆర్ఓబి) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో దుర్గానగర్, వేంపల్లి గ్రామాల మధ్య కేఎం 195/29-31 వద్ద ఉన్న ఎల్‌సి-79 లెవెల్ క్రాసింగ్ వద్ద ప్రతిపాదిత రోడ్డు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యుబి) నిర్మాణానికి సంబంధించి జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. ఈ తనిఖీలో రోడ్ సెక్టార్ ప్రాజెక్టు రైల్వే భూ సేకరణ నిపుణులు పి. దేవరాజు, తహసీల్దార్ మల్లేపు మధుకర్, ఆర్అండ్‌బి శాఖ డీఈఈ బి. లక్ష్మీనారాయణ, ఏఈఈ క్రాంతి, పంచాయతీ రాజ్ జూనియర్ అసిస్టెంట్ ఎ. సాయికుమార్ దుర్గానగర్, వేంపల్లి, ఈస్గాం గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శి ఎస్. సుమలత హాజరయ్యారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగనున్నాయని అధికారులు తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యుల నియామక దరఖాస్తులకు నేడే చివరి రోజు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవడానికి శనివారం(11న) చివరి రోజని మున్సిపల్ కమిషనర్ గజానంద్ శుక్రవారం తెలిపారు. మొత్తం 4 గురు కోఆప్షన్ సభ్యులకు గాను ప్రత్యేక పరిజ్ఞానం గలవారు ఇద్దరికి (2) అవకాశం ఉండగా, వారిలో ఒక (1)మహిళ, అదేవిధంగా మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరికి (2) కూడా అవకాశం ఉండగా వారిలో ఒక (1)మహిళకు అవకాశం కలదని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :**

అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఒక ట్రాక్టర్ ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పరిశీలనలో వాహనానికి సంబంధించిన ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. దీంతో ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అయన పేర్కొన్నారు.



## ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్ట్

**సారంగాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లో నిర్వహించనున్న ముదిరాజ్ మహాసభకు వెళ్లకుండా సారంగాపూర్ మండలంలోని ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. హాలో ముదిరాజ్ చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా రాజధానికి బయలుదేరుతున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా కోర్ కమిటీ సభ్యుడు దొంతుల శేఖర్, దోడ భోజన్న, సింధు నారాయణ, సింధు చందు, ముస్కూరి గంగయ్య, బర్లె సత్తన్న తదితరులు ఉన్నారు.

**మందమర్రి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

ముదిరాజ్ ఉద్యమంపై పోలీసుల ముందస్తు చర్యలలో భాగంగా మందమర్రిలో పలువురి నాయకులను అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో ముదిరాజ్ సంఘాలు చేపట్టిన "హలో ముదిరాజ్ - చలో గాంధీ భవన్ ముట్టడి" కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం మందమర్రిలో పలువురు ముదిరాజ్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ముదిరాజ్ పెద్దలు నెల్లి రాజలింగు ముదిరాజ్, కట్ల శ్రీనివాస్ ముదిరాజ్, గరిగ సుమన్ ముదిరాజ్‌లను ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. కోకాపేట భూమిపై ఉన్న ట్రస్టును రద్దు చేసి ముదిరాజ్ జాతికి అంకితం చేయాలని, అలాగే మత్స్యశాఖ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న ముట్టడి కార్యక్రమానికి మద్దతుగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.





మల్బరీ తోటను పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీత

## పట్టు పురుగుల పెంపకంతో లాభసాటి ఆదాయం

**ఖానాపూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

పట్టు పురుగుల పెంపకం రైతులకు ఎంతో లాభదాయకమైన ఉపాధి మార్గమని ఖానాపూర్ అధికారులు తెలిపారు. కడెం మండలం నర్సాపూర్ గ్రామంలో మల్బరీ తోట, పట్టు పురుగుల పెంపక కేంద్రాన్ని ఎంపీడీవో సునీత, ఏపీఓ జయదేవ్, పంచాయతీ కార్యదర్శి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టు పురుగుల పెంపకం విధానం, లాభాలపై టెక్నికల్ అసిస్టెంట్ రామును అడిగి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ, మల్బరీ తోట పెంపకానికి కనీసం రెండెకరాల భూమి, నీటి సౌకర్యం ఉండాలని సూచించారు. ప్రభుత్వం పట్టు పురుగుల షెడ్ నిర్మాణానికి కేంద్రం నుంచి రూ. 4.50 లక్షలు, రాష్ట్రం నుంచి రూ. 1.50 లక్షల వరకు పూర్తి సబ్సిడీ అందిస్తుందని వివరించారు. నెలకు ఒక పంట చొప్పున ఏడాదికి ఏడు పంటలు తీయవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు



ఉత్సవ్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు పాఠశాల సిబ్బంది

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు

**మంచిర్యాల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

మంచిర్యాల నగరంలోని లక్ష్మీనగర్ శాఖకు చెందిన శ్రీ చైతన్య పాఠశాల, 1వ తరగతి, 6వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థుల కోసం శుక్రవారం ఘనంగా స్నాతకోత్సవ వేడుకలను ఏర్పాటు చేశారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో వేడుకలు నిర్వహించి, విద్యార్థులకు స్నాతకోత్సవం ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ అయూబ్ ప్రమోట్ అయిన విద్యార్థులందరినీ అభినందించి, వారి భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సాంస్కృృతిక నృత్యాలలో పాల్గొని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్లు జయశ్రీ, రోజా రాణి, ఇన్‌చార్జ్ అనగమాట ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**దండేపల్లి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

దండేపల్లి మండలంలోని కన్నెపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ... శిశువు జీవితంలోని తొలి ఆది



సంవత్సరాలలో మెదడు వికాసాన్ని ప్రోత్సహించడం చాలా ముఖ్యమని అన్నారు, అలాగే గర్భిణీ బాలింతలకు శిశు పోషణ పై అవగాహన కల్పించారు. పోషకాహార ప్రాముఖ్యత స్థానికంగా దొరికే ఆకుకూరలు కూరగాయలు పళ్ళు గురించి వివరించి చెప్పడం జరిగింది అమ్మమ్మలు నానమ్మల ద్వారా పిల్లలకి కథలు చెప్పించాలని చెప్పడం జరిగింది, అలాగే పిల్లలకి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జె వెంకటలక్ష్మి, కన్నెపెల్లి సర్పంచ్ చుంచు నగేష్, ఉప సర్పంచ్ ముత్తె శంకరయ్య, వార్డ్ సభ్యులు, ఎఎన్ఎమ్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ స్వరూప, సంధ్య, అంగన్వాడి ఆయా, ఆశా గ్రామంలోని గద్దిన బాలింతలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఏకారి లిఖితను సన్మానిస్తున్న దృశ్యం

## సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఏకారి లిఖిత ప్రతిభ అందరికీ స్పూర్తిదాయకం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు

- జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన పండ్ల వ్యాపారి కుమార్తెకు ఘన సన్మానం

నస్పూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఏకారి లిఖిత ప్రతిభ అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు అన్నారు. నస్పూర్ మండలం అరుణక్కనగర్‌కు చెందిన ఏకారి లిఖిత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా శుక్రవారం మేకల దాసు ఆమెను స్వయంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. పట్టుదలతో చదివి న్యాయశాఖలో అత్యున్నత కొలువు సాధించిన లిఖితను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదగడం జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు. లిఖిత తల్లిదండ్రులు లక్ష్మి, వెంకటేష్ సీసీసీ కార్నర్ వద్ద చిన్న పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రుల శ్రమను చూస్తూ పట్టుదలతో చదివిన లిఖిత ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. న్యాయశాఖలో కీలకమైన పదవికి ఎంపికయ్యారు. లిఖిత సాధించిన విజయం పట్ల సీపీఐ, శ్రీరాంపూర్ ఏరియా పండ్ల వర్తక సంఘం ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు మేకల దాసు వెల్లడించారు. శ్రమించే తత్వం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఈ సందర్భంగా మేకల దాసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీరాంపూర్ శాఖ కార్యదర్శి పూజారి రామన్న, పుల్ల రమేష్, గాజుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ వీక్‌లో భాగంగా మందుల నియంత్రణపై అవగాహన ర్యాలీ

- నకిలీ మందుల నివారణపై ప్రత్యేక డ్రైవ్

- జిల్లా ఔషధ పరిశీలకురాలు చందన

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జరుగుతున్న హెల్త్ వీక్ కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఏప్రిల్ 11వ తేదీని ఔషధ నియంత్రణ మరియు నియంత్రణ వ్యవస్థ బలోపేత దినోత్సవంగా ప్రకటించి, మందుల వినియోగం మరియు పంపిణీపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టుతున్నారు. మందుల సక్రమ వినియోగం, అలవాటు పడి పోయే మందుల నియంత్రణ, బాధ్యతాయుతంగా మందుల పంపిణీ, సరైన లైసెన్స్‌ల పరిశీలన, నకిలీ మందుల నివారణ, నాణ్యమైన మందుల అందుబాటు వంటి కీలక అంశాలపై ప్రజలకు మరియు కెమిస్టులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా ఉంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 11వ తేదీ శనివారం రోజున ఉదయం 9:30 గంటలకు డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ బెల్లంపల్లి చౌరస్తా నుండి రాఘవరావు హాస్పిటల్ వరకు ప్రారంభమై, బస్టాండ్ వరకు కొనసాగుతుంది. అనంతరం కెమిస్ట్స్ భవన్ హాల్‌లో సమావేశం నిర్వహించి, కెమిస్టులకు మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. జిల్లా/నగర కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ తరఫున, జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల యజమానులు, ఫార్మాసిస్టులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో మందుల వినియోగంపై అవగాహన పెరగడమే కాకుండా, నకిలీ మందుల నియంత్రణకు కూడా దోహదం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 12న మంచిర్యాలకు కేటీఆర్

- జిల్లా బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొననున్న కేటీఆర్ - కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్

మంచిర్యాల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 12న మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మాజీ విప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు కేటీఆర్ పర్యటన షెడ్యూల్ ఖరారు అయింది. ఆదివారం ఉదయం 11 గం.లకు నస్పూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో భవిష్యత్ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం అధికార కాంగ్రెస్ అరాచకాలను ఎదురొడ్డి గెలిచిన క్యాతనపల్లి మున్సిపాలిటీ నూతన పాలక మండలి సభ్యులను కేటీఆర్ సన్మానించనున్నారు. సమావేశం అనంతరం ఎంఎన్ఆర్ గార్డెన్ లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కూతురి వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదిస్తారు. అక్కడి నుంచి క్యాతనపల్లిలోని మాజీ విప్ బాల్క సుమన్ ఇంటికి కేటీఆర్ చేరుకుంటారు. వివిధ సంఘాల నేతల తో సమావేశమవుతారు. అనంతరం మీడియాతో ఇంటరాక్షన్ కానున్నారు.



## మందమర్రిలో సేవాస్ఫూర్తి.. వందలాది మంది రక్తదానం

### పూలే-అంబేద్కర్ జయంతికై.... ప్రాణదానంగా మారిన వేడుక

మందమర్రి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

మహాత్మ జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణంలోని సి.ఆర్. క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఏరియా జీఎం రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ రక్తదాన కార్యక్రమంలో 100 మందికి పైగా స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. పలు సంఘాల నాయకులు కూడా తమ రక్తాన్ని దానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా పలువురికి ప్రాణదానం చేసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందించారు. అలాగే మందమర్రి పట్టణంలో ఏప్రిల్ 14న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## కార్మికుల పట్ల మేనేజర్ అసభ్య ప్రవర్తన సరికాదు: తిప్పారపు సారయ్య

- ఇందారం 1ఏ గని మేనేజర్ తీరుపై హెచ్ఎంఎస్ నిరసన

నస్పూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

ఇందారం 1ఏ గని మేనేజర్ కోటయ్య కార్మికులతో అసభ్యంగా మాట్లాడటం మానుకోవాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గని ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేనేజర్ తీరును ఎండగట్టారు. కార్మికులను కించపరుస్తూ మాట్లాడటం, అకారణంగా సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లు ఇస్తూ మానసిక వేధింపులకు గురిచేయడం సరికాదని మండిపడ్డారు. గనిలో ఉత్పత్తి తగ్గడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్పష్టం చేశారు. గనిలో తాగునీరు, వెంటిలేషన్, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేవని సారయ్య విమర్శించారు. నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయకుండా ఉత్పత్తి కోసం కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేనేజర్ ఆపరేషన్ మీన నాగన్నకు వినతిపత్రం అందజేశారు. అసభ్యంగా ప్రవర్తించిన మేనేజర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, నాయకులు దుర్గ ప్రసాద్, శ్రీనివాస్, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.



## ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లోని పండ్ల తోటల మెగా వేలంపాట

ఉట్నూర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

ఐటీడీఏ ఉట్నూరు పరిధిలోని ఉద్యాన నర్స రీలలో ఉన్న పండ్ల తోటలకు ఒకేసారి మూడు సంవత్స రాలకు కలిపి మెగా వేలం పాట ఈనెల 16 నాడు ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ప్రాజెక్ట్ అధికారి యువరాజు మర్మాట్ ఒక ప్రకటనలో తెలిపారు. గతానికి భిన్నంగా మూడు సంవత్స రాలకు మూడు పంటలకు కలిపి ఈ వేలం పాట ఉంటుందని, వ్యాపారస్తులు, రైతులు, వ్యక్తులు, సంస్థలు ఐటిడిఏ ఉద్యాన నర్స రీలను కార్యాలయ వేళల్లో సందర్శించి 16 నాడు జరిగే వేలంపాటలో పాల్గొనాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. మామిడి మరియు సపోటా పంటకు ఈ వేలంపాట జరగనుంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్; ఆసిఫాబాద్ జిల్లా జంబుగా రాజంపేట మరియు మంచిర్యాల జిల్లా భీమారం బెల్లంపల్లి తోటలకు ఏప్రిల్ 16 నాడు ఒకేసారి ఉట్నూర్ లోని ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో మెగా వేలంపాట నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి ని సంప్రదించాలని పేర్కొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం

- మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్

ఆసిఫాబాద్ టౌన్ , ఏప్రిల్ 10, ప్రభాతవార్త :

పట్టణంలోని ప్రతి వార్డులో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని మున్సి పల్ చైర్ పర్స న్ ఆకాష్, వైస్ చైర్ పర్స న్ ఎండి అహ్మద్ స్పష్టం చేశారు. పట్టణంలోని 12వ వార్డులో గత వారం రోజులుగా వాటర్ మోటార్ చెడిపోవడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను మున్సి పల్ చైర్ పర్స న్, వైస్ చైర్ పర్స న్, కౌన్సి లర్ ఆత్రం కృష్ణమ్మల దృష్టికి కాలనీవాసులు తీసుకురావడంతో శుక్రవారం నూతన వాటర్ మోటార్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ వార్డు ప్రజల విన్నపం మేరకు యుద్ధ ప్రాతిపదికన కొత్త మోటార్‌ను మంజూరు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. ప్రజా సేవలో భాగంగా వార్డుల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. తమ సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పరిష్కరించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్‌పర్స న్, వైస్ చైర్‌పర్స న్ శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్మాన్ ఖాన్, ఆత్రం భీం భాయ్, నూరి, సుప్రజ, జమీల్ హుస్సేన్, ఆఫ్తాబ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.